batukammanews.com
TEL/2019/78873

బతుకమ్మ

13 నవంబర్ 2026
శుక్రవారం

తాజా వార్తల సద్దిమూట

హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా

మహేష్ భగవత్

- తెలంగాణ పోలీస్ శాఖలో భారీ బదిలీలు
- ఒకేసారి 21 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ

2 లో

- సజ్జనర్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్ బాధ్యతలు





అమ్మో... ఆ మున్సిపాలిటీ కమిషనర్ పోస్టా ?

- కమిషనర్లకు కలిసి రాని భైంసా మున్సిపాలిటీ
- ఏడు సంవత్సరాల కాల వ్యవధిలో పది మంది కమిషనర్లు

నిర్మల్ జిల్లాలోని ఆ మున్సిపాలిటీ పేరు చెబితే కమిషనర్లు హడలెత్తిపోతున్నారు. అక్కడ పోస్టింగ్ అంటే మేము రాము కుయ్యో మొర్రో అని మొత్తుకుంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఆ మున్సిపాలిటీలో ఏడు సంవత్సరాల లంలోనే పది మంది కమిషనర్లు మారారు. మారరంటే బదిలీ వల్లనో , పదోన్నతుల వల్లనో అనకుంటే పొరబడినట్లే. ఇక్కడ మున్సిపాలిటీ కమిషనర్లకు కలిసి రావడం లేదు. కమిషనర్లుగా విధులు నిర్వహించిన వారు అవస్థలు పడక తప్పడం లేదు. ఏదో ఒక సమస్యతో ఇబ్బందుల పాలవుతున్నారు.

– భైంసా, బతుకమ్మ

2

గడిచిన ఏడేళ్ల కాల వ్యవధిలో ఇక్కడి మున్సిపాలిటీకి ఏకంగా పదిమంది కమిషనర్లు మారారు. వీరిలో ముగ్గురి ఉద్యోగ కాలం సవ్యంగా సాఫీగా ముగిసింది. మిగతా ఏడుగురు కమిషనర్ల ఉద్యోగ కాలం సమస్యలు, వివాదాలు, కేసులు,సస్పెన్షన్లు,ఏసీజీ చిక్కడం,శాఖపరమైన చర్యల బారిన పడటం జరిగింది. 2019 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు పదిమంది అధికారులు కమిషనర్లుగా విధులు నిర్వహించగా ఏడుగురు అవస్థల పాలవ్వ డం గమనార్హం.

ఏడుగురికి ఏదో ఒక సమస్య

భైంసా మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు నిర్వహించిన అధికారుల్లో ఇద్దరు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. మరో అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇంకొకరిని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెం డర్ చేశారు. మరో కమిషనర్ విధుల్లో ఉండగానే ఆనారో గ్యానికి గురై మృతి చెందారు. ఇంకొక అధికారి పోలీసు కేసులో చిక్కుకొని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో అధికారి అర్ధాం తరంగా బదిలీపై వెళ్లాల్సి వచ్చింది. ఇలా పదిమందిలో ఏడుగురు వివిధ కారణాలతో వార్తల్లో నిలవడం చర్చనియాంశంగా మారింది.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి

మాదాపూర్, వెల్గటూర్‌లో రీసర్వే ప్రక్రియ

పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

2 లో

రైతులు, భూ యజమానుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.

– మాక్లూర్, బతుకమ్మ





2 లో

నేటి నుండి లింబాద్రిగుట్ట నిత్య బ్రహ్మోత్సవాలు

ప్రారంభం

మండల కేంద్రానికి సమీపంలో లింబాద్రిగుట్ట పై వేలసిన అందరి భక్తుల ఆరాధ్య దైవం శ్రీనింబాచల లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్య బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

– భీమ్ బతుకమ్మ

కోర్టు ధిక్కరణపై అధికారులపై చర్యలేవి?

రెవెన్యూ అధికారుల అలసత్వంపై చర్యలు తీసుకుంటారా?

అనర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇచ్చిన అధికారులపై చర్యలేవి

సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్

2 లో



ఇటీవల కోర్టు ధిక్కరణకు పాల్పడిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించడాన్ని స్వాగతిస్తున్నామని మరి నిజామాబాద్ జిల్లాలో కోర్టు ఆదేశాలను అమలు చేయని అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ ప్రశ్నించారు. గురువారం నగరంలోని కోటగల్లిలోని ఎన్ఆర్ భవన్ లో సీపీఐ(ఎంఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి బాబన్న ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

– నిజామాబాద్, బతుకమ్మ

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి



జక్రాన్పల్లి మండలం మాదాపూర్, మెండోరా మండలం వెల్లటూర్ లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు, పట్టాదారుకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వహిస్తూ, వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే, తమ దృష్టికి తేవాలన్నారు. రీ సర్వే వేగవంతానికి అదనంగా అవసరమైన రోవర్ యంత్రాలను సమకూరుస్తామని అన్నారు. రీ సర్వే ప్రక్రియ నిర్వహణలో అలసత్వానికి తావిస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ హద్దు, ప్రభుత్వ భూమి, పట్టా భూములకు సంబంధించిన పూర్తి వివరాలు రీసర్వే ఆధారంగా పక్కాగా నమోదు చేయాలన్నారు. సర్వే అనంతరం గ్రామ సభలు నిర్వహిస్తూ, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వారి నుండి దరఖాస్తులు స్వీకరించి వేగంగా పరిష్కరించాల న్నారు. రీసర్వే విషయం లో రైతులకు, భూ యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

కోర్టు ధిక్కరణపై అధికారులపై చర్యలేవి?

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం, జిల్లా నాయకులు రమేష్ లు మాట్లాడుతూ సిరికొండ మండల కేంద్రంలో 532 సర్వే నంబర్ లో 209లో పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, భూములపై న్యాయపోరాటం చేయగా 2012లోనే న్యాయస్థానం బాధితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. దాదాపు 14 సంవత్సరాలుగా అర్హులైన బాధితులకు భూములు అందజేయడంలో జిల్లా స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నలు లేవనెత్తారు. న్యాయస్థానం ఆదేశించిన అధికారులు ఎందుకు పేదలకు న్యాయం చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో 96 డబుల్ బెడ్ రూం ఇళ్ళకు గాను 92 మందికి కేటాయించారని అందులో 22 మంది అనర్హులున్నారని తెలిపారు. అర్హులైన నలుగురికి ఇళ్ళను కేటాయించకపోతే బాధితులు హైకోర్టును ఆశ్రయించగా వారిని అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. అనర్హులను, స్థానికేతరులను ఎంపిక చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటారా అని అధికార యంత్రాంగాన్ని నిలదీశారు. కోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా స్థాయి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా మహేష్ భగవత్

సజ్జనర్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్ బాధ్యతలు

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ బదిలీలు

ఒకేసారి 21 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రక్షాళన చేపట్టింది. పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు కీలక పోలీస్ విభాగాల్లో కొత్త అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం జీవో నంబర్ 1654ను విడుదల చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, గవర్నర్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ మార్పు. నగర పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న వీసీ సజ్జనార్‌ను మరో కీలక బాధ్యతకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో 1995 బ్యాచ్ ఐపీఎస్ అధికారి మహేష్ మురళీధర్ భగవత్‌ను నియమించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాల కట్టడి వంటి కీలక అంశాల నేపథ్యంలో ఈ నియామకానికి ప్రాధాన్యత ఏర్పడింది.

హైదరాబాద్ సీపీగా మహేష్ భగవత్

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేష్ మురళీధర్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటివరకు శాంతిభద్రతల విభాగంలో డీజీపీ హోదాలో పనిచేసిన ఆయనకు ఇప్పుడు నగర పోలీస్ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా, ట్రాఫిక్ సమస్యలు, మహిళల భద్రత వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో ఆయన పాత్ర కీలకం కానుంది.

సజ్జనార్‌కు ఫైర్ అండ్ డిజాస్టర్‌కు బదిలీ

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్,ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డీజీపీగా నియమించారు. అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్ పీఎఫ్)డీజీపీ బాధ్యతలను కూడా అప్పగించారు. పోలీస్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించిన సజ్జనార్‌కు మరో ముఖ్యమైన విభాగాన్ని అప్పగించడం ఈ బదిలీల్లో ప్రత్యేకంగా నిలిచింది. డా. సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీ టీమ్స్,భరోసా విభాగం డీజీపీగా నియమించారు. అదనంగా డీజీపీ అర్గనైజేషన్,డీజీపీ లీగల్ బాధ్యతలు కూడా అప్పగించారు. జైళ్లు, దిద్దుబాటు సేవల శాఖ డీజీపీగా స్వాతి లక్రాను నియమించారు. ఆమెకు హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు కూడా కేటాయించారు. మహిళల భద్రత, బాధితులకు న్యాయ సహాయం,మహిళలపై నేరాల నియంత్రణ, జైళ్లలో సంస్కరణలు వంటి అంశాల్లో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీపీగా చారు సిన్హాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు కొనసాగనున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, లంచగొండితనం,అక్రమ ఆస్తుల కేసుల దర్యాప్తులో ఏసీబీ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో ఏసీబీకి కొత్త నాయకత్వం రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా డా. అనిల్ కుమార్‌ను నియమించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన వై. నాగిరెడ్డిని సివిల్ సప్లైస్ కమిషనర్‌గా నియమించారు. ఆయనకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం,పౌర సరఫరాల శాఖ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్యతలతో పాటు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ,లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. గ్రేహౌండ్స్,ఆక్టోపస్ ఆపరేషన్స్ డీజీపీగా విక్రమ్ సింగ్ మాన్‌ను నియమించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీపీగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు.ఎం. స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్,రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టీజీ–టీఎంఏఆర్ఎస్) డైరెక్టర్‌గా నియమించారు.శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సభర్వాల్‌కు బాధ్యతలు అప్పగించారు. అదనంగా కోఆర్డినేషన్,టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలు కూడా నిర్వహించనున్నారు. ఎస్. చంద్రశేఖర్ రెడ్డిని?ఏసీబీ డైరెక్టర్ గా, కార్తికేయ మల్లి జోన్–1 ఐజీ??ఐసీసీసీ అదనపు బాధ్యతలను,కే. రమేష్ నాయుడు రైల్వేస్ ఐజీగా,డి. జోయల్ డేవిస్రోడ్ సేఫ్టీ,ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్, జి. చందన దీప్తి జోన్–7 జోగులాంబ డీఐజీ అదనపు బాధ్యత,ఆర్. భాస్కరన్ ఇంటెలిజెన్స్ డీఐజీ అదనపు బాధ్యత, కే. నారాయణ నాయక్ జోన్–2 బాసర డీఐజీ అదనపు బాధ్యత, ఎల్.ఎస్. చౌహాన్ కోఆర్డినేషన్ డీఐజీ, జోన్–6 చర్లపల్లి అదనపు బాధ్యత, బాలాదేవిని టీజీ–టీఎంఏఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్)గా వి.అరవిందబాబు హైదరాబాద్ డీసీపీ,ఎస్ఏం అండ్ ఐటీ విభాగంలో నియమించారు.

నేటి నుండి లింబాద్రిగుట్ట నిత్య బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఈ నిత్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ధర్మకర్త సంభ పార్థసారథి, అర్చకులు క్షేత్రదేవత అయిన చండిక దేవి (పెదంగంటి ఎల్లమ్మ)కి సారె సమర్పణ చేశారు.ఈ నెల 15న మధ్యాహ్నం 1.00 గంటలకు శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామాల యం నుండి లింబాద్రి గుట్టకు శ్రీవారి ఉత్సవమూర్తులు ఊరేగింపుగా పల్లకిలో బయలుదేరుతారు. ఈ నెల 16న శ్రవణ యుక్త క్షేరాభిషేకం, దీపారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, 17న ధ్వజారోహణం, 18న శ్రీనృసింహ ఏకాక్షరీహోవనం, అన్నకూటోత్సవం, శ్రీవారి కళ్యాణం ఎదురుకోలు, 19న శ్రీవారి కళ్యాణం, 20న ఏకాదశి, శ్రీనృసింహహోవనం, 21న ఉత్తన ఏకాదశి ద్వాదశి, ఉదయం 7.58 కి హరివరాసనం, ప్రభోదోత్సవం, శ్రీతులసి వివాహం, ఉదయం 11 గంటలకు కొండ ప్రధక్షణ,సాయంత్రం 5.00 గంటలకు గరుడసే , 22న నృసింహో ఏకాక్షరీహోవనం, హోమం, బలిప్రధానం, 23న దాత్రీమూలే నృసింహపూజ, దాత్రి హోవనం , సాయంత్రం 5.30 కు దీపోత్సవం, సీతానగరం పై డోలారోణం, 24న. జాతర, మధ్యాహ్నం 3.00 లకు శ్రీవారి రాథోత్సవం, 25న శేష హోమం, చక్ర తీర్థం,వ్యాసపూజ, పూర్ణహుతి, రాత్రి 7.00 లకు పుష్పయాగం, 26న దేవతోఉద్వసన, ధ్వాజారోహణం, ఉద్వసన బలిప్రధానం,కొండబలి, పుష్కరిణి పై డోలోత్సవం,సాయంత్రం అశ్వవాహనం పై శ్రీవారు ఊరేగింపుగా గ్రామాలయంకు వెంచేయడం సప్తవరణ పూజతో ఉత్సవ సమాప్తం జరుగుతుంది.

అమ్మో . . . ఆ మున్సిపాలిటీ కమిషనర్ పోస్టా?

˘మిషనర్ల పదవీ కాలం . . .? పరిస్థితి ఇలా...

2019 డిసెంబరు 31న ఇక్కడి మున్సిపాలిటీకి కమిష ˘నర్ గా ఎంఎ. ఖదీర్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విధుల్లో ఉండగానే ఆనారోగ్యం బారిన పడి 2021 సంవత్సరం ఫిబ్రవరి22న మృతి చెందాడు. ఆయన స్థానంలో ఎంఎ. ఆలీమ్ 2021 సంవత్సరం ఫిబ్ర వరి 23న కమిషనర్ గా బాధ్యతలు చేపట్టి 2022 నవంబరు 23 వరకు విధులు నిర్వహించి నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బాన్సువాడ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. అయితే ఆయన ఇక్కడ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు నిర్వహించిన సమ యంలో 19 మంది ఉద్యోగస్తులను నియమించిన ప్రక్రియలో చోటు చేసుకున్న వివాదంపై బదిలీ అనంతరం బాన్స్ వాడలో విధులు నిర్వహిస్తుండగా సస్పెన్షన్ వేటు పడింది. తదనంతరం ఏ.సంపత్ కుమార్ ఎఫ్ఏసీ కమిషనర్ గా 2022 నవంబరు 23 నుంచి 2023 ఫిబ్రవరి 28 వరకు బాధ్యతలు నిర్వహించారు. అటు తరువాత ఏ. వెంకటేశ్వర్లు 2023 ఫిబ్రవరి 28 నుంచి కమిషనర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈయన విధుల్లో ఉండగానే రూ.30 వేలను పరోక్ష పద్ధతిలో లంచంగా స్వీకరించి 2024 మే 22న అవినీతి శాఖాధికారులకు పట్టుబడ్డారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ ఎక్స్కూక్యూటివ్ ఇంజనీర్ గా ఉన్న సీహెచ్ సుదర్శన్ రెడ్డికి ఇంచార్జీ కమిషనర్ గా అధనపు బాధ్యతలు అప్పచెప్పారు. ఈయన 2024 మే 23 నుంచి 2024 ఆగస్టు 4 వరకు బాధ్యతలను నిర్వహించారు. అటు పిమ్మట రాజేష్ కుమార్ ఇక్కడి మున్సిపల్ కమిషనర్ గా 2024 ఆగస్టు 8 న బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో ఉండగా ఒక ఆస్తి మ్యూటేషన్కు సంబంధించి నెలకొన్న వివాదంలో పోలీసు కేసు బారిన పడ్డ ఆయన 2025 నవంబరు 11న ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయాడు. తదనం తరం బైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ ఇక్కడి మున్సిపల్ కమిషనర్ గా 2025 నవంబరు 27 నుంచి 2026 మార్చి 6 వరకు అధనపు బాధ్యతలు చేపట్టారు. అనంతరం వై. నవీన్ 2026 మార్చి 7 నుంచి మే 2 వరకు కమిషనర్ గా విధులు చేపట్టారు. ఇదే సమయంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక విషయంలో తీవ్ర వివాదాలు చెలరేగడంతో ఆయన ఆర్ధారంతరంగా బదిలీపై వెళ్లిపోయారు. ఈ క్రమంలో మామిడి పెల్లి లింగయ్య మే 2న కమిషనర్ గా బాధ్యలు చేపట్టారు. ఈయన మున్సిపల్ నిధులను ఆక్రమంగా ఇతర బ్యాంక్ ఖాతాలకు తరలించడం, విధులకు తరచూ గైర్హాజరవ్వడం, అందుబాటులో లేకుండా పోవడం,సెల్ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంచడం తదితర కార ణాలతో పాలకవర్గం జిల్లా కలెక్టర కార్యాలయానికి సరెండర్ చేసింది. సెప్టెంబరు 30న ఆయనను పాలక వర్గం కలెక్టర్ కు సరెండర్ చేసిన వెంటనే కార్యాలయంలో డిప్యూటీ ఎక్స్కూక్యూటివ్ ఇంజనీర్ నున్న జాదవ్ సంతోష్ కు ఇంచార్జీ కమిషనర్ అధనపు బాధ్యతలు అప్పచెప్పారు. అయితే మంగళవారం ఆయన ఒక కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించే విషయంలో రూ.50 వేలు లంచం నేరుగా తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖాధికారులకు నిర్మల్ లో పట్టుబడ్డారు. ప్రస్తుతం ఆయన స్థానంలో బైంసా ఎంపీడీవో నీరజ్ కుమార్ కు మున్సిపల్ ఇంచార్జీ కమిషనర్ అధనపు బాధ్యతలు అప్పచెప్పారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : వినాయక్ నగర్ పరిధిలోని 33/11 కెవి సబ్ స్టేషన్, 11 కేవీ వినాయక నగర్ 2 ఫీడర్స్ టవర్స్ పనులు చేయడానికి అవసరమైన నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏడిఈ ఓపీ టౌన్ -3 వినోద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి లేడీ మేయర్ రోడ్డు, 5 చేతుల పోచమ్మ ఆలయం, అగర్వాల్ హాస్పిటల్, ఎలేట్ ఎంపోరియం, వెస్ట్ సైడ్ షాప్,శివాలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, ముందస్తు ఏర్పాట్లు చేసుకుని, విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా కోరారు.

నీటి పొదుపే రైతుకు శ్రీరామరక్ష ఆరుతడి పంటల సాగుతో అధిక లాభాలు

ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం లో రైతులకు వ్యవసాయ అధికారి రాంబాబు సూచన



ఆలూర్, బతుకమ్మ :ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాంబాబు మాట్లాడుతూ రైతులు నేల పరీక్షల ఆధారంగా పంటలకు అవసరమైన సమతుల్య ఎరువులను వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రీయ ఎరువులు, జీవ ఎరువులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వ్యవసాయంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని తెలిపారు. భూమి సారాన్ని కాపాడుకుంటూ తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా అధిక లాభాలు అందించే విధంగా సాగు పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశాల దృష్ట్యా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీటి వినియోగాన్ని తగ్గించి, వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలైన కంది, పెసర, మినుము,శనగ వంటి పంటలను సాగు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పంటల ఎంపికలో స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం,?నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రకృతి వనరులను సంరక్షించుకుంటూ?భవిష్యత్ తరాలకు భూమి సారాన్ని అందించేలా ప్రతి రైతు బాధ్యతాయుతమైన వ్యవసాయ విధానాలను పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేగాం గ్రామ సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి, ఏఈవో సాయి కృష్ణ, వసుధం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి: ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ



ఆలూర్, బతుకమ్మ :
ఆలూరు ఉన్నత పాఠశాలలో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలూర్ మండల కేంద్రంలో మండల విద్యాధికారి నరేందర్,?నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ,ఆర్మూర్ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ రఘుపతి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా 18?సంవత్సరాల లోపు విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని??రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ట్రాఫిక్ ఎస్ఐ రఘుపతి మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తాము ట్రాఫిక్ నియమాలు పాటించడంతోపాటు వాటి గురించి తమ తల్లిదండ్రులకు కూడా వివరించాలని సూచించారు. మైనర్ విద్యార్థులకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రులు కూడా మానుకోవాలని??చిన్న వయసులో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. మండల విద్యాధికారి నరేందర్ మాట్లాడుతూ ట్రాఫిక్ అధికారులు సూచించిన నిబంధనలను విద్యార్థులందరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. రోడ్డు భద్రతపై నేర్చుకున్న విషయాలను ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు ఇతరుల ప్రాణాలకు కూడా రక్షణ కల్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిటీ రాజేష్,?పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో

విలీనం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిజామాబాద్ నగరంలో ఖిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సింది పోయి విలీనం పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని, ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రతిపాదనను పునఃపరిశీలించా లన్నారు. విలీనం పేరుతో ప్రభుత్వ జూనియర్ ఈకళాశాలల ప్రత్యేక ఉనికికి, ఇంటర్మీడియట్ అధ్యాపకుల పోస్టులకు, విద్యార్థుల విద్యా అవకాశాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందనీ,?ముఖ్యంగా గ్రామీణ,పేద,?సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై ఆధారపడి ఉన్నారన్నారు. ఈ వ్యవస్థ బలహీనపడితే పేద విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనీ, విద్యను ప్రైవేటీకరించి కార్పొరేట్ విద్యా సంస్థలకు మేలుకూర్చే విద్యా వ్యతిరేక విధానాలను రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొస్తున్నారని, నూతన జాతీయ విద్యా విధానం 2020ను ఒకవైపు వ్యతిరేకిస్తూ మరొకవైపు తెలంగాణలో అమలు చేస్తే అనటం సరైనది కాదని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలనీ, ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నగర అధ్యక్షులు సిర్రం పవన్ కుమార్, నాయకులు బోస్, రమేష్, సంతోష్, వంశీ, ప్రసాద్ ,వేణు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో టీఎన్జీవో సభ్యత్వ నమోదు ప్రారంభం



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల జిల్లా విద్యాశాఖ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి టీఎన్జీవో సభ్యత్వాన్ని సదరు శాఖ ఉద్యోగులకు అందజేసి, టీఎన్జీవో సభ్యత్వం ప్రాముఖ్యతను వివరించి, ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల సమస్యలే పరమావధి గా భావిస్తున్న టీఎన్జీవో సంఘం ప్రతి ఉద్యోగికి యెల్లవేళల్లో అందుబాటు ఉంటూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ సమావేశానికి టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షులు శివకుమార్, టీఎన్జీవో అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, విద్యాశాఖ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు అశ్విన్ కుమార్, శోభన్,టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, వ్యవసాయ శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి గోవర్ధన్, ఆయా శాఖల ఉద్యోగులు, మహిళా ఉద్యోగ సోదరీమణులు హాజరై టీఎన్జీవో సభ్యత్వాన్ని స్వీకరించారు.

ప్రభుత్వ ఆసుపత్రికి నిధులు మంజూరు చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి వినతి



చందూర్, బతుకమ్మ : చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేయడానికి అవసరమైన రూ.40 లక్షల నిధులు మంజూరు చేయాలని హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు చందూర్ మండల ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్ కర్ణం సాయిరెడ్డి, కారేగాం తాండా సర్పంచ్ డా. లాల్ సింగ్, లక్ష్మాపూర్ సర్పంచ్ ఉమా సంజీవ్, మేడిపల్లి సర్పంచ్ శ్రావణి రవి, ఇతర గ్రామ పెద్దలు మంత్రివర్యులను కలిసి ఆసుపత్రి పనుల ప్రాధాన్యతను వివరించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రూ.40 లక్షల నిధులు అవసరమని వివరించగా మంత్రి దామోదర రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు. చందూర్ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేసిన ఈ ప్రయత్నానికి సానుకూలంగా స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, ప్రత్యేక చొరవ చూపిన ఎం.పి సురేష్ షెట్కార్, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి మండల ప్రజల తరఫున హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

2024 డీఎస్సీ ఎస్జీటీలకు

క్యాడర్ ఉత్తర్వులు జారీ చేయాలి..!

పిఆర్ టి తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో 2024లో నియమితులైన ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్ వారికి సమాన కేటగిరి (లాంగ్వేజ్ పండిట్, పీఈటి, ఇతర) ఉపాధ్యాయుల ప్రొబేషన్ కాలం రెండు సంవత్సరాలు పూర్తి చేసిన వారి ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు విడుదల చేయాలని పిఆర్ టి తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి డిమాండ్ చేశారు. వీరి ప్రతిపాదనలను సంబంధిత ఎంఈఓ/ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యాశాఖ అధికారికి డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ హైదరాబాద్ మెమో నెంబర్ 253/జిఈఎన్/2026 తేది.24.10.206 ప్రకారం దాదాపు 300పై ఉపాధ్యాయులు తమ నియామక ఉత్తర్వులు, జాయినింగ్ రిపోర్టు తదితర ప్రపోజల్స్ జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించినప్పటికీ నేటికీ ఆ ఉపాధ్యాయుల ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు విడుదల కాలేదన్నారు. కావున తెలంగాణ, ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996?ప్రకారంగా రూల్(16) అండ్ (18) 1996 తక్షణమే 2024 డీఎస్సీ ద్వారా నియమితులైన ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్, సమాన కేటగిరి ఉపాధ్యాయుల ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు విడుదల చేయాలని కృపాల్ సింగ్ సోడి డిమాండ్ చేశారు.

హేమంగ్ జోషిని సన్మానించిన ఆమంద్ విజయ్ కృష్ణ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : బీజేవైఎం జాతీయ అధ్యక్షులు హేమంగ్ జోషి తెలంగాణ పర్యటనలో భాగంగా బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ నేతృత్వంలో జాతీయ అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కో-కోశాధికారి ఆమంద్ విజయ్ కృష్ణ హేమంగ్ జోషిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో యువమోర్చా చేపడుతున్న కార్యక్రమాలు, యువతను సంఘటితం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం,సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించారు.జాతీయ అధ్యక్షుల మార్గదర్శకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో యువమోర్చాను మరింత బలోపేతం చేస్తూ యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని ఆమంద్ విజయ్ కృష్ణ తెలిపారు.



టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు మున్నూరు కాపు సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడంపై సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సామాజిక వర్గ ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం సామాజిక వర్గ అభ్యున్నతికి,సంఘటిత శక్తికి కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, రాంభూపాల్,నిజామాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, రత్నాకర్, గోపికృష్ణ, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

చిన్న శక్కర్గ పంచాయతీ నిర్వహణపై ప్రత్యేక సమావేశం



మద్నూర్, బతుకమ్మ : మద్నూర్ మండలం చిన్న శక్కర్గ గ్రామ పంచాయతీ పరిపాలనా వ్యవహారాలపై గురువారం అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఎంపీడీవో సాయిలు, ఎంపీవో సత్యనారాయణ గ్రామ వార్డు సభ్యులతో కలిసి ఈ సమావేశాన్ని జరిపారు.గత కొన్ని నెలల క్రితం గ్రామ సర్పంచ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో అభివృద్ధి పనులు మరియు పంచాయతీ రోజువారీ నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు వార్డు సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు.సమావేశంలో వార్డు సభ్యుల అభిప్రాయాలను సేకరించిన ఎంపీడీవో సాయిలు మాట్లాడుతూ, గ్రామ పాలన సజావుగా సాగేందుకు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించామని తెలిపారు. ఇక్కడి పరిస్థితులపై సమగ్ర నివేదికను తయారు చేసి తదుపరి చర్యల నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భూ భారతి రీ సర్వేపై రెవెన్యూ అధికారుల ప్రత్యేక దృష్టి

క్షేత్రస్థాయిలో పరిశీలించిన తహసీల్దార్ ప్రశాంత్ కుమార్



వర్ని, బతుకమ్మ : భూ భారతి కార్యక్రమంలో భాగంగా వర్ని మండల పరిధిలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కూనిపూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మండల తహసీల్దార్ ప్రశాంత్ కుమార్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించిన ఆయన ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూముల హద్దులను ఖచ్చితంగా గుర్తించి, సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల గిర్దావర్ శ్యామ్ కుమార్, జీపీఓ భీమేష్,సర్వేయర్ చంద్రయ్యతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువు లోపు అభివృద్ధి పనుల నిర్మాణాలను పూర్తి చేయాలి

ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి





బోధన్, బతుకమ్మ : బోధన్ పట్టణ అభివృద్ధి పనులపై ఆర్డీఓ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన పనుల ప్రగతిని, అమృత్ పథకం, టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపడుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని, నిర్దేశిత గడువు లోపు నాణ్యతతో పూర్తి చేసేలా నిశిత పర్యవేక్షణ జరపాలని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పైప్ లైన్ల మరమ్మతులు, లీకేజీలను అరికట్టడం, ట్యాంకుల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని అన్నారు. బోధన్ మున్సిపల్ పట్టణం పరిధిలో కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు నీటిని అందిస్తున్నందున నీటి సరఫరా సమయాన్ని గంట పాటు కొనసాగించాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అవసరమైతే వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని నీటి సరఫరా చేసేందుకు వీలుగా ప్రైవేటు బోర్లను గుర్తించాలన్నారు. బోధన్ మున్సిపల్ కార్యాలయ నూతన భవన సముదాయం నిర్మాణానికి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు నిర్వహణ, బయో మైనింగ్ సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఇతర ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను మైల్ స్టోన్ ప్రకారం జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని, ప్రతి స్కూల్లో తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉండాలన్నారు. సమీక్షా సమావేశంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మా శరత్ రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ విజయ కుమారి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఆర్ అండ్ బీ ఎస్.ఈ అజ్మీరా రాము, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో

క్లస్టర్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

పాఠశాల అభివృద్ధికి రూ.6 కోట్లు . . . ప్రాంత అభివృద్ధికి రూ.11 కోట్లు కేటాయింపు

నాలుగు ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే భూపతిరెడ్డి





ఇందల్వాయి, బతుకమ్మ : ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన క్లస్టర్ లెవెల్ కల్చరల్ ఫెస్ట్ కు ఎమ్మెల్యే ఆర్. భూపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సాంస్కృతిక, సాహిత్య,క్రీడా రంగాల్లో నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలు,సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి,అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందల్వాయి ఏకలవ్య పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం,ఇతర మౌలిక వసతులు,అభివృద్ధి పనుల కోసం రూ.6 కోట్ల కేటాయించినట్లు వెల్లడించారు. అదేవిధంగా పాఠశాల నుంచి మాక్మూర్ తండా వరకు రహదారి నిర్మాణంతో పాటు ఈ ప్రాంతంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం మరో రూ.11 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తయ్యాయని,మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయ సిబ్బంది విజ్ఞప్తి మేరకు విద్యార్థులకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించేందుకు నాలుగు ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలించి,ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి,విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు విద్యలోనే కాకుండా కళలు, సంస్కృతి,క్రీడలు,సామాజిక సేవ వంటి వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ పాఠశాలకు,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఆర్మూర్ మున్సిపాలిటీని ముట్టడించిన దళిత సంఘాలు



ఆర్మూర్, బతుకమ్మ : ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిల్ 30వ వార్డు కౌన్సిలర్ పృథ్వీపై జరిగిన దాడిని నిరసిస్తూ దళిత సంఘాలు బల్దియా కార్యాలయాన్ని ముట్టడించారు. కౌన్సిలర్ పృథ్వీ కి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ న్యాయం చేయాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా మాల కులాల జేఏసీ చైర్మన్ బండి రవీందర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇత్వార్పేట్ లింగన్న,దళిత ఐక్య సంఘటన సభ్యులు కొక్కెర భూమన్న, ఎమ్మార్పీఎస్,జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్, ఇందార్పు రాజు,ఇతరత్రా దళిత సంఘాల నాయకులు కలిసి మున్సిపల్ కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 30వ వార్డు కౌన్సిలర్ పృథ్వీ కి జరిగిన అన్యాయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి?బాధితుడికి న్యాయం చేయాలని ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ బాధితుడు పృథ్వీ ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొని విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.దళిత ప్రజాప్రతినిధులకు అవమానం జరిగితే దళిత సమాజం చూస్తూ ఊరుకోదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ప్రజాప్రతినిధికి సమాన గౌరవం, హక్కులు కల్పించాలని బాధితుడికి న్యాయం జరిగే వరకు దళిత సంఘాలు ఐక్యంగా పోరాడుతాయి అని జేఏసీ చైర్మన్ బండి రవీందర్ తో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు పలువురు హెచ్చరించారు. ముందుగా ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ముందు, మున్సిపల్ కార్యాలయం ముందు దళిత సంఘాల ఆధ్వర్యంలో?జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన..



కమ్మర్‌పల్లి, బతుకమ్మ :మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ భవనం పైన రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న గ్రంథాలయ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ బైకన్ జమున మహేష్ గురువారం రోజున శంకుస్థాపన చేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు కే.ఆర్.సురేష్ రెడ్డి నిధులతో ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ...గ్రంథాలయాలు దేవాలయాల వంటివని,పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు అలాగే పాఠశాల విద్యార్థులకు ఈ గ్రంథాలయ భవనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు సురేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిలివేరి భూమేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు బందేల రాజు, నెల్ల రమేష్, అంకాడి శేఖర్, చిలివేరి లక్ష్మి, నాయకులు డి.రవి, బీఎన్.మోహన్, ప్రశాంత్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతులే ట్రాక్టర్లతో రైస్ మిల్లులకు వరి తరలింపు

భిక్కనూరు,బతుకమ్మ:కష్టపడి పండించిన వరిని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు తెరవక, తెరిచినా తేమ శాతం పేరుతో వెనక్కి పంపుతుండటంతో, చేసేది లేక రైతులే సొంత ట్రాక్టర్లతో వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.భిక్కనూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పంట కోసి, కుప్పలు పోసి వారం రోజులు అవుతున్నా కొనుగోలు కేంద్రాల్లో అధికారులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే పంట పాడైపోతుందనే భయంతో గిట్టుబాటు ధర రాకపోయినా సరే మిల్లులకు అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

సొంత ఖర్చుతో తరలింపు:

ప్రభుత్వం కొంటే రవాణా, హమాలీ ఖర్చులు కొంత భారం తగ్గేది. కానీ ఇప్పుడు రైతులే ట్రాక్టర్ కిరాయి, డీజిల్ ఖర్చు భరించి మిల్లులకు తీసుకెళ్తున్నారు. ఒక ట్రిప్ కు రూ. 2000 నుండి రూ. 3000 వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఆ ఖర్చు కూడా రైతుల మీదే పడుతోంది.మద్దతు ధరకు మిల్లుల్లో దిక్కు లేదు:ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,320 (సాధారణ రకం) రావాల్సి ఉండగా, మిల్లర్లు రూ. 1,800 నుండి రూ. 1,950 వరకే ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తేమ ఎక్కువ ఉందని, రంగు లేదని సాకులు చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎరువులు, విత్తనాలు, కూలీలు ట్రాక్టర్ కిరాయిలతో పెట్టుబడి పెరిగిపోయింది. ప్రభుత్వం కొనకపోతే మేము ఎలా బతకాలి వర్షం వస్తే పంట మొత్తం పోతుంది. అందుకే నష్టానికైనా సరే మిల్లుకు తీసుకెళ్తున్నాం అని ఒక రైతు కన్నీళ్లతో చెప్పారు.



రైతుల డిమాండ్:

వెంటనే గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, రైతుల నుండి మద్దతు ధరకు వరిని కొనుగోలు చేయాలని, మిల్లర్ల దోపిడీని అరికట్టాలని రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

ఏర్గట్ల ఉన్నత పాఠశాలలో 70 ఎస్,జి,ఎఫ్ జోనల్ క్రీడలు

ఏర్గట్ల,బతుకమ్మ: పిఎం శ్రీ జిల్లా ఉన్నత పాఠశాల ఏర్గట్లలో 70వ ఎస్,జి,ఎఫ్, కమ్మర్ పల్లి జోనల్ స్థాయి ఆటల పోటీలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కమ్మర్ పల్లి,మోర్తాడ్, మరియు ఏర్గట్ల మండలంలో ఉన్నటువంటి వివిధ పాఠశాలల విద్యార్థులకు అండర్ 14 అండర్17బాలబాలికలకు కబడ్డీ మరియు ఖోఖో పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభా కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి ఎంపిక చేశారు.సుమారు 250 మంది విద్యార్థులు ఈ క్రీడా పోటీలలో పాల్గొన్నారు.ఈ క్రీడలకు కన్వీనర్ గా నిర్వహించిన పాఠశాల గేజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ,ఆటల వల్ల



శారీరక బలంతోపాటు మానసిక ఆనందం కలుగుతుందని,ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయిలో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆటలలో గెలుపోటములు సహజమని,గెలిచినవారు పొంగిపోరాదని,ఓడినవారు కృంగిపోరాదని,విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో కూడా రాణించాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి మాట్లాడుతూ ఏర్గట్ల ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి ఆటల పోటీ లు నిర్వహించడం శుభ పరిణామమని ముమ్ముందు ఈ పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ ఆటల పోటీలలో ఉత్తమ ప్రథమ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సున్నపు లక్ష్మి శ్రీనివాస్,వీడిసి చైర్మన్ ముత్తన్న,క్యాషియర్ సర్పరెడ్డి,జోనల్ సెక్రెటరీ నాగభూషణం,మోర్తాడ్ మండల క్రీడా అధికారి శ్యామ్,ఏర్గట్ల మండల క్రీడా అధికారి ఆనంద్,వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పిటిలు ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ సేవా రథం ప్రచార పత్రాన్ని ప్రారంభించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

కామారెడ్డి, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నపూర్ణ సేవా రథం ప్రచార పత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. అన్నపూర్ణ సేవా రథం ద్వారా కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా కుటుంబంలోని అప్పులను కోల్పోయి విషాదంలో ఉన్న సమయంలో అంతక్రియల కార్యక్రమానికి వచ్చే బంధుమిత్రులకు భోజనం ఏర్పాటు చేయడం అనే ఉద్దేశంతో సేవలు అందించాలనే సంకల్పం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ?ఈ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, డిసిసి ఉపాధ్యక్షులు పంపరి





లక్ష్మణ్,డిసిసి జనరల్ సెక్రెటరీ జూలూరి సుధాకర్, తాటి ప్రసాద్, కామారెడ్డి మాజీ కౌన్సిలర్లు జమీల్, సలీం,చింతల రవీందర్ గౌడ్, చాట్ల వంశీ, పిడుగు సాయిబాబా, రంగా రమేష్ గౌడ్, సునీల్ గౌడ్, బండారి శ్రీకాంత్, అరవింద్, బల్ల శ్రీనివాస్ ఉన్నారు.

ఏర్గట్ల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి

ఐమాక్స్ లైట్లు ఏర్పాటు

హర్షం వ్యక్తం చేసిన గౌడ సంఘ సభ్యులు

ఏర్గట్ల,బతుకమ్మ; ఏర్గట్ల మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి ఐమాక్స్ లైట్లు అవసరం ఉన్న విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి దృష్టికి తీసుక వెళ్లడంతో15 ఫైనాన్స్ నిధుల ద్వారా వెంటనే 1లక్ష 50 వేల రూపాయల విలువ గల ఐమాక్స్ లైట్లు మంజూరు ఇప్పించడం జరిగిందని ఏర్గట్ల గ్రామ గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఇట్టి ఐమాక్స్ లైట్లు గురువారం రోజున గీతా కార్మిక సంఘ సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇట్టి సందర్భంలో గౌడ సంఘ సభ్యులు మాట్లాడుతూ మా కులదైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయానికి అడిగిన వెంటనే ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసినందుకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి కి ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్,ఉప సర్పంచ్ సున్నపు లక్ష్మి శ్రీనివాస్,కు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో ఏర్గట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేండ్ల రాజారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం జీవన్ రెడ్డి,బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, కూరాకుల బోర్రన్న,బద్దం కిషన్,మినుముల సాగర్, బద్దం మత్యం,గౌడ సంఘం ఏర్గట్ల మండల అధ్యక్షుడు సుదనవేని శ్రీనివాస్ గౌడ్, అన్నెల మురళి గౌడ్, కోల రమేష్ గౌడ్,రంగు వెంకట్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుదనవేని నరేష్ గౌడ్, సుదన వేణి నాగరాజు గౌడ్, ప్రసాద్ గౌడ్,కోల రాజేందర్ గౌడ్,ఏర్గట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గీతా కార్మిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



జీజీహెచ్ పై నుంచి పడి ఒకరి దుర్మరణం

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నాల్గవ అంతస్తు నుంచి పడి ఒక వ్యక్తి దుర్మరణం చెందారు. మంగళవారం జీజీహెచ్ లోని నాల్గవ అంతస్తులో ఓ వ్యక్తి చోరికి యత్నించారు. ఆ ఫ్లోర్ లో ఉన్న నర్సింగ్ విద్యార్థినిల బ్యాగ్ లో నుంచి చోరికి యత్నించగా ఫ్లోర్ ఇంచార్జి గమనించాడు. అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయే క్రమంలో నాల్గవ అంతస్తు నుంచి జారీ కింద పడ్డాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని జీజీహెచ్ లోనే వైద్య సేవలందించినా ఫలితం లేకుండాపోయింది. ఈ మేరకు స్థానిక 1వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

బాధిత కుటుంబానికి ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆర్థిక సహాయం...



పోతంగల్, బతుకమ్మ న్యూస్ : పోతంగల్ మండలంలోని దోమలేడ్డి గ్రామంలో సుద్దవార్ సురేష్(42)అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో చనిపోవడం జరిగింది. ఈ విషయం స్థానిక బీజేపీ నాయకుల ద్వారా తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ 5000/- రూపాయలు ఆర్థిక సహాయం చేసి వారి పిల్లల చదువులకు అండగా ఉంటానని భరోసా నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందూర్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మార్కెల్లి ప్రకాష్ పటేల్, పోతంగల్ మండలం కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్ పటేల్ (ఒమానా పటేల్), రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, బూత్ అధ్యక్షులు కమ్మరి శ్రీకాంత్, సాయికుమార్, మేత్రి గంగారాం, సాయిలు, అరుణ్, వెంకటేష్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో 108, 102 అంబులెన్స్‌లకు ఆకస్మిక తనిఖీ



భిక్కనూరు,బతుకమ్మ : భిక్కనూరు మండల కేంద్రంలో ఉన్నటువంటి 108, 102 అంబులెన్స్ లను అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ప్రోగ్రాం మేనేజర్ సంపత్,ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తిరుపతి తనిఖీలు చేపట్టారు. అంబులెన్స్ లలో ఉన్న మెడిసిన్లను ఆక్సిజన్ స్ట్రెచర్ ఫస్ట్ ఎయిడ్ కిట్ తదితర అత్యవసర పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలకు అంబులెన్స్ సేవలు వెంటనే అందుబాటులో ఉండాలని సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులు సిబ్బందికి సూచించారు. అంబులెన్స్ లు ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని మెడిసిన్లు గడువు ముగియకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ రాజేందర్, పైలట్ భిక్షపతి అలాగే 102 అంబులెన్స్ సిబ్బంది స్వామికి తగు సూచనలు ఇచ్చారు.

ముల్లపంది మాంసం అక్రమ విక్రయం..

ఇద్దరి అరెస్ట్
నిందితులకు 14 రోజుల రిమాండ్



కమ్మర్ పల్లి, బతుకమ్మ :మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో భారతీయ ముల్లపంది మాంసాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు.అనంతరం వారిని ఆర్మూర్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో నిందితులను నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించారు.ఈ దాడిలో కమ్మర్‌పల్లి ఎఫ్‌ఆర్‌ఓ బి.అరుణ్‌కుమార్, మోర్తాడ్ డిప్యూటీ రేంజ్ అధికారి చంద్రమౌళి, బషీరాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్, కోనాపూర్ బీట్ ఆఫీసర్ పవన్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ డిఈ సత్యనారాయణ గౌడ్ ఇంట్లో ఏసిబి తనిఖీలు



వెబ్ డెస్క్, బతుకమ్మ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణ లతో ఇరిగేషన్ డిఈ సత్యనారాయణ గౌడ్ ఇంట్లో ఏసిబి అధికారులు దాడులు చేపట్టారు. గురువారం కర్మన్ ఘాట్ లోని అయన ప్లాట్లో ఏసీబీ అధికారుల తనిఖీలు చేశారు. ఆదాయం కంటే అధిక ఆస్తులు ఉన్నట్లు అధికారులు ఆస్తులు గుర్తించారు.వనపర్తి లో 25 ఎకరాలు వ్యవసాయ భూమి, ఒక ఫామ్ హౌస్, 9 ఓపెన్ ప్లాట్స్, ఒక విల్లా, ఒకటి 3 బి హెచ్ కె , ఒకటి 2 బి హెచ్ కె ప్లాట్లు, 50తులాల బంగారం గుర్తించారు.మొత్తం 10 ప్రాంతాల్లో ఏసిబి అధికారులు సోదాలు నిర్వహించారు.

వెల్మల్‌లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



నందిపేట్ బతుకమ్మ. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిగురువారం రోజున నందిపేట్ మండల కేంద్రం లో సుడిగాలి పర్యటన చేశారు వ్యవసాయ శాఖ అధికారులు మరియు రెవెన్యూ అధికారులతో కలిసి వెల్మల్ గ్రామంలో మోడల్ వ్యవసాయ మార్కెట్ నిర్మాణం కోసం రెండు ఎకరాల అనుకూల స్థలాన్ని పరిశీలించడం జరిగింది.ఈ మార్కెట్ ఏర్పాటుతో రైతులకు తమ పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు, మధ్యవర్తుల బెడద తప్పుతుందన్నారు అనంతరం గ్రామంలోని వీధి లైట్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు వంటి పలు సమస్యల గురించి గ్రామస్తుల నుండి అడిగి తెలుసుకొని, వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు , ఈ కార్యక్రమంలో వెల్మల్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ రైతులు బిజెపి పార్టీమండల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫోరా కమిటీ సమావేశంలో ఎంపీ అర్వింద్



వెబ్ డెస్క్, బతుకమ్మ :పార్లమెంట్ జాయింట్ కమిటీ అఫ్ ఫారన్ కాంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్)ఆరవ సమావేశం మంగళవారం జరిగింది. ఢిల్లీ పార్లమెంట్ హాల్ లో జరిగిన ఫోరా సమావేశం లో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి పాల్గొన్నారు. సంబందిత సమావేశంలో ఫోరా బిల్ 2026 పై చర్చించారు.



ఖేలో ఇండియా ఎంపికలో
అనర్హులకు అవకాశాలు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేల్ ఇండియా కార్య క్రమానికి సాఫ్ట్ బాల్ తెలంగాణ రాష్ట్ర జట్ల ఎంపికలు అనర్హులకు అవకాశం ఇస్తున్నట్లు పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షులు సతీష్ ఆరోపించారు. మహిళల జట్టుల విషయంలో ప్రధానంగా అర్హులకు అవకాశం రావట్లేదన్నారు. గురుకులాలలో చదువుతున్న విద్యార్థులు గతంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని పేరు ప్రతిష్టలు తెచ్చిన వారికి ఈ పోటీల్లో ఎంపిక చేయట్లేదని ఆవేదన చెందుతున్నారని అన్నారు.కావున ఖేలో ఇండియా సాఫ్ట్ బాల్ పోటీలకు అర్హులను ఎంపిక చేయాలని పిడిఎస్ యూ డిమాండ్ చేస్తుందన్నారు.ఈ ఎంపిక విషయాల్లో కోచ్ లతోపాటు జిల్లా కలెక్టర్ కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అర్హులకు అవకాశం వచ్చేటట్టు చూడాలని పిడిఎస్ యూ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

కోటగల్లి పాఠశాల విద్యార్థులకు
ప్యాడ్స్ బుక్స్ అందజేత



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : పదవి విరమణ పొందిన జిపిఎస్ కోట గల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ చందర్ గైక్వాడ్ గురువారం పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, బుక్స్ అందజేశారు. ఉద్యోగ విరమణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పుస్తకాలు అందజేసి ప్రోత్సహించారు. సమయం వృధా చేయకుండా క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసన్న, లక్ష్మి, మమత, సౌందర్య, సంతోష్, నందిని ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలి

బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి






ఇందల్వాయి, నవంబర్ 12 బతుకమ్మ:కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెంచి, పార్టీ బలోపేతానికి ప్రతి గ్రామంలో ఉన్న కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని తీర్మన్ పల్లి గౌడ సంఘంలో ఇందల్వాయి బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేష్ కులచారి మాట్లాడుతూ, త్వరలో తెలంగాణలో జరగనున్న భారీ బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నభి గారు రానున్న నేపథ్యంలో, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుండి బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో బిజెపి మాజీ మండల అధ్యక్షులు నాయిడి రాజన్న, మండల ఇన్చార్జి అధ్యక్షుడు శ్రీనివాస్ జెల్లెల్ల, నల్లవెల్లి సర్పంచ్ కన్నె రాజేందర్, స్టేషన్ తండా సర్పంచ్ జగత్ సింగ్, దిశా కమిటీ మెంబర్ ప్రదీప్ రెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి తన్నీరు వాసు, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు మహేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు కిషన్, నాయకులు శ్రావణ్, అశోక్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల భారం ఉన్నా సంక్షేమ పథకాల అమలు ఆగదు: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

ఇందల్వాయిలో లబ్ధిదారులకు 'చేయూత' పింఛన్ పత్రాల పంపిణీ

ఎంపీ అరవింద్, బీఆర్ఎస్ నేతల తీరుపై రూరల్ ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు





ఇందల్వాయి,బతుకమ్మ:గత ప్రభుత్వం చేసిన అప్పుల ఊబిలో తెలంగాణ రాష్ట్రం కూరుకుపోయి ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, 'చేయూత' పథకం కింద కొత్తగా మంజూరైన అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ప్రతిపక్షాల విమర్శలపై స్పందనఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా, పేదలకు అందాల్సిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుంటే, ప్రతిపక్షాలు మాత్రం రాజకీయ లబ్ధి కోసం ఇష్టారీతిన విమర్శలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.పసుపు బోర్డు పేరుకే పరిమితం: ఎంపీ అరవింద్‌పై ఆరోపణలు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పనితీరుపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తన సుదీర్ఘ పదవీకాలంలో ఎంపీ అరవింద్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించింది శూన్యమని ఆరోపించారు. పసుపు రైతుల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డు విషయంలో కేవలం బోర్డు ప్రకటనకే పరిమితమయ్యారని, రైతులకు క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆయన విమర్శించారు. అలాగే, మాధవ్ నగర్ ఆర్ఓబీ నిర్మాణం విషయంలో ఎంపీ అనుసరిస్తున్న తీరు ప్రజలను మోసం చేసే విధంగా ఉందని భూపతి రెడ్డి వ్యాఖ్యానించారు. కరువుపై బీఆర్ఎస్ నేతలు గందరగోళం సృష్టిస్తున్నారుఅనంతరం బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా 'ఎల్ నినో' ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే, రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనంతరావు, తాసిల్దార్ జి. బాలయ్య, ఎస్సై సుమలత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతాల కిషన్, మాజీ మండల అధ్యక్షుడు సవిన్ గౌడ్, స్థానిక సర్పంచ్ దిలీప్, ఇందల్వాయి సర్పంచ్ లోకాని గంగమని గంగారాం, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సుదర్శన్ నాయక్, సర్పంచులు సుజాత, శ్రీనివాస్,రాజు నాయక్, కన్నె రాజేందర్, సాయి కృష్ణ, మౌనిక,ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థినులు ఎంపిక

-అండర్-14 విభాగంలో ఎం. అనన్య, ఎం. వైశాలి ఎంపిక,

-విద్యార్థినులను అభినందించిన పాఠశాల హెచ్ఎం, సర్పంచ్, గ్రామ పెద్దలు,



భీమ్‌గల్, బతుకమ్మ : మండలంలోని బడా భీమ్‌గల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. అనన్య, ఎం.వైశాలిలు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భూపతి తెలిపారు. కామారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్-- కామారెడ్డి జిల్లాల అండర్-14 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఎంపిక పోటీల్లో మంచి ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి వాలీబాల్ కు ఎంపిక య్యారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్ లో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో వీరు పాల్గొనను న్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణస్వామి, బడా భీమ్‌గల్ సర్పంచ్ రాచకొండ విష్ణు, శంకర్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాగుల గంగ మోహన్, వీడీసీ సభ్యులు విద్యార్థిని లను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాచకొండ విష్ణు, ఉప సర్పంచ్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనూ అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, శిక్షణ అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని అన్నారు. బడా భీమ్‌గల్ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించా రు.విద్యార్థినులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు గ్రామం తరపున ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భూపతి మాట్లాడుతూ.. విద్యార్థినులు క్రమశిక్షణతో సాధన చేయడం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైంద న్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఇదే ఉత్సాహంతో ఆడి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థినుల విజయానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష



భీమ్ గల్, బతుకమ్మ :భీమ్ గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన ఒక వ్యక్తికి ఆర్మూర్ రెండవ న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించిందని ఎస్సై ఎం చిరంజీవి తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందన్నారు . వాహనదారులు ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రానైట్ క్వారీలో నీటి తోడివేతపై విచారణ జరిపించాలి..!

భూగర్భ జలాలపై ప్రభావం..
తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం

భీమ్‌గల్, బతుకమ్మ :గ్రానైట్ క్వారీలో భారీగా నీటిని తోడివేస్తుండటంతో భూగర్భ జలాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని, దీనిపై అధికారులు తక్షణమే విచారణ జరిపించాలని దేవన్‌పల్లి గ్రామస్తులు కోరారు. భీమ్‌గల్ మండలం దేవన్‌పల్లి గ్రామ పరిధిలోని డైజెన్ రాక్ గ్రానైట్ క్వారీలో జరుగుతున్న నీటి తోడివేతను నిలిపివేసి, గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు గురువారం తహసీల్దార్ ఎం. కిరణ్ కుమార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ,క్వారీలో భారీ స్థాయిలో తవ్వకాలు చేపట్టడం వల్ల పెద్ద మొత్తంలో నీటి ఊట ఏర్పడుతోందని, భారీ సామర్థ్యం కలిగిన మోటార్లతో నిరంతరం నీటిని బయటకు తోడుతూ కాలువలోకి వదులుతున్నారని తెలిపారు.ఇలా పెద్ద మొత్తంలో నీటిని బయటకు పంపించడం వల్ల భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా గ్రామంలోని బోరుబావులు, బావుల్లో నీటి మట్టాలు తగ్గి భవిష్యత్తులో తాగునీటి సమస్య తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా వేసవికాలంలో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.సంబంధిత మైనింగ్ శాఖ, భూగర్భ జలాల శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి క్వారీలో



జరుగుతున్న తవ్వకాలు, నీటి తోడివేతపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. క్వారీ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, నిబంధనలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా నీటిని తోడివేస్తున్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ ప్రజలకు భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా భూగర్భ జలాల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని దేవన్‌పల్లి గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లకావత్ శేఖర్, ఉప సర్పంచ్ గంగ సాయిలు మాజీ ఎంపీటీసీ ఆరే.రవీందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు మహిపాల్, మాజీ సర్పంచ్ బొడ్డు గంగారాం,మాజీ ఉప సర్పంచ్ రామచందర్,పాలకవర్గం సభ్యులు, వీడిసి సభ్యులు, బంజారా నాయకులు శర్మ నాయక్,తూకాజి నాయక్, రాజు నాయక్, వివిధ గ్రామాల సర్పంచ్లు గ్రామ మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ పేరుతో రైతులను వేధించడం ఆపాలి..!

సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.3,500 చెల్లించాలి..
దళారులకు అమ్మిన రైతులకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలి
బీజేపీ మండల ప్రెసిడెంట్ అరె రవీందర్

భీమ్ గల్, బతుకమ్మ : అటవీ శాఖ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేయడం ఆపాలని, సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.3,500 గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు దళారులకు ధాన్యం విక్రయించిన రైతులకు సైతం రూ.500 బోనస్ అందించాలని బీజేపీ భీమ్ గల్ మండల ప్రెసిడెంట్ అరే రవీందర్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో 40 నుంచి 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల విషయంలో అటవీ శాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పంటల కోత సమయంలో హార్వెస్టర్లు, ట్రాక్టర్లను సైతం అడ్డుకోవడం సరికాదని, సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌పై నమ్మకంతో రైతులు సన్నవడ్లు సాగు చేయగా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులకు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సన్నవడ్లకు క్వింటాల్‌కు కనీసం రూ.3,500 ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దళారులకు ధాన్యం అమ్ముకున్న అర్హులైన రైతులకు కూడా పంట సాగు వివరాల ఆధారంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు.రైతుల భూములకు భద్రత కల్పించి, పంటలకు గిట్టుబాటు ధర అందించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రైతులకు అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, కుప్కల్ సర్పంచ్ నర్సింగ్ రావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తోట గంగాధర్, నాయకులు తక్కూరి అంజయ్య, కొట్టాల మోహన్, ఈర్ల మహేందర్, రజినీకాంత్, ప్రేమ్ చంద్, లింబాద్రి, రమావత్ వెంకటేష్, రాజు కుమార్, మధు, లింబాద్రి నాయక్, రాజేష్, పిప్రి లింబాద్రి, మల్లెల రమేష్, సుంకరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్

కోనరావుపేట, బతుకమ్మ :రైతులు పండించిన పత్తికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర అందించడంతో పాటు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని కావేరి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లతో పాటు కొనుగోలు కేంద్రంలో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో నాణ్యతా



ప్రమాణాలను పాటించాలని, పత్తిలో తేమ శాతం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులకు కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, ఆత్మ కమిటీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన

కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, ఖచ్చితత్వంతో వివరాలు సేకరిస్తూ నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని, రోజూ వారీగా లక్ష్యం నిర్దేశించుకుని దానికి అనుగుణంగా రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులన్నారు. పరిశీలనలో తహసీల్దార్ వరలక్ష్మి, నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్, డీఐ రాజేంద్ర ప్రసాద్, సర్వేయర్, తదితరులు ఉన్నారు.

రోజూ అవకాడో, మామిడిపండ్లను తింటే గుండె పదిలం..
అధ్యయనంలో వెల్లడి..

వెబ్ డెస్క్, బతుకమ్మ :రోజూ ఒక అవకాడో, ఒక కప్పు మామిడి పండ్లను తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా మధుమేహానికి ముందు దశలో ఉన్న పెద్దలలో ఈ రెండు పండ్లను ఎనిమిది వారాల పాటు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తనాళాల పనితీరు మెరుగుపడడంతోపాటు, డయాస్టోలిక్ రక్తపోటు తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ ప్రయోజనాలు పురుషుల్లో మరింత స్పష్టంగా కనిపించాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ మార్పులు శరీర బరువు పెరగకుండా, రోజువారీ కేలరీలను తీసుకోవడంలో పెద్దగా మార్పు లేకుండానే కనిపించాయి. అమెరికాలోని ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని



నిర్వహించారు. ఇందులో ఒక మధ్యస్థ పరిమాణంలోని హాస్ అవకాడో, ఒక కప్పు తాజా మామిడి పండ్లను రోజూ తీసుకునేలా ఒక బృందానికి ఆహార ప్రణాళిక రూపొందించారు. మరో బృందానికి సమాన కేలరీలు కలిగిన పిండి పదార్థాల ఆహారాన్ని అందించారు. ఈ పరిశోధన వివరాలు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.పురుషుల్లో కేంద్ర రక్తపోటు సగటున 5 పాయింట్లు పెరగ్గా, ఈ రెండు పండ్లు తీసుకున్నవారిలో సుమారు 1.9 పాయింట్లు తగ్గింది. గుండె కొట్టుకునే మధ్యలో విశ్రాంతి తీసుకునే సమయంలో ధమనుల్లో ఉండే ఒత్తిడిని డయాస్టోలిక్ రక్తపోటు సూచిస్తుంది. ఇది అధికంగా ఉంటే గుండె, రక్తనాళాలపై అదనపు భారం పడుతుంది.